విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

మంగళవారం 5, నవంబరు -2024 4 పేజీలు

సీఎం చంద్రబాబును కలిసిన వేమిరెడ్డి దంపతులు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు ధన్యవాదాలు తెలియజేశారు. సోమవారం అమరావతిలోని సీఎం నివాసానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులు. ఈ సందర్భంగా సీఎంని కలిసి టిటిడి బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించడంపై సీఎం కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దేవదేవుడి సేవకు అవకాశం రావడం సంతోషంగా ఉందని,తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కునేలా శ్రీవారి భక్తులకు సేవ చేస్తామని వారు స్పష్టం చేశారు.

ప్రత్యేక గ్రీవెన్స్‌కు పోటెత్తిన ప్రజానీకం :ఎమ్మెల్యే సోమిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావిజ్ఞాపనల కార్యక్రమానికి 550కి పైగా అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూమా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటగా వెంకటాచలంలో స్పెషల్ గ్రీవెన్స్ డే నిర్వహించామన్నారు. వందలాది మంది అర్జీలతో బారులుదీరారంటే గత ప్రభుత్వం ప్రజల కోసం ఏ స్థాయిలో పనిచేశారో అర్థమవుతోందన్నారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరు, రీసర్వేలో తప్పిదాలు, భూఆక్రమణలు సంబంధించిన సమస్యలపైనే మెజార్టీ వినతులు వచ్చాయి అంగ న్వాడీ భవనాల నిర్మాణాలను మధ్యలోనే నిలిపేశారు. పాఠశాలల్లో వసతులదీ అదే పరిస్థితి. శ్మశానాలకు దారులు లేవు.ఉన్నవి ఆక్రమణకు గురయ్యాయి. ప్రతి

2

పరిపాలనలో అధికార పార్టీ నాయకుల పెత్తనం..?

కార్పొరేషన్ ఉద్యోగులతో సమావేశం..ఉద్యోగుల అసహనం

మంత్రి నారాయణకు అప్రతిష్ట తెస్తున్న వైనం..!

విశాలాంధ్ర, నెల్లూరు కార్పొరేషన్ :ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వైసిపి ప్రభుత్వ పోకడలు సమసిపోతాయని అందరూ భావించారు. ఈ ప్రభుత్వంలో కూడా ఆ పోకడలే కొనసాగుతున్నాయి. ఉద్యోగులపై అధికార పార్టీ నాయకుల పెత్తనం కొనసాగుతోంది. ముఖ్యంగా నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఇందుకు ఉదాహరణ ఇటీవల నెల్లూరులోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ఆయన విద్యాసంస్థల నిర్వహణ బాధ్యత చూస్తున్న ఉద్యోగి, రూరల్ ఎమ్మెల్యే సోదరుడు అనధికారికంగా నెల్లూరు కార్పొరేషన్ ఉద్యోగులతో సమావేశమయ్యారు.విశ్వసనీయంగా తెలిసిన సమాచారం మేరకు నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి నెల్లూరు కార్పొరేషన్ లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులకు ఫోన్ వచ్చింది. సారాంశం ఏమిటంటే రెవిన్యూ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు మంత్రి క్యాంపు కార్యాలయానికి రావాలని హుకుం. అక్కడ నుంచి ఫోన్ వచ్చిందే తడవుగా అధికారులంతా శనివారం సాయంత్రం 7:00 సమయంలో మంత్రి క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వీరితో మాట్లాడడానికి నారాయణ విద్యాసంస్థల కీలక బాధ్యుడు, రూరల్ ఎమ్మెల్యే సోదరుడు సిద్ధంగా ఉన్నారు. ముందు రెవిన్యూ విభాగంలో ఎంతమంది అధికారులు ఉన్నారు..

ఇంకెవరైనా సిబ్బంది అవసరం అవుతారా అంటూ అధికార పార్టీలో రాజ్యాంగేతర శక్తులుగా చలామణి అవుతున్న ఇద్దరు కార్పొరేషన్ రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. పనిలో పనిగా నారాయణ విద్యాసంస్థల్లో కీలకంగా ఉన్న ఆ నాయకుడు ఒక ఆర్‌ఐ పనితీరుపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ ఆర్ ఐ నాకు నచ్చలేదు.. వెంటనే పంపించేయండి అంటూ రెవెన్యూ విభాగం అధికారులకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఇంకెంత మంది సిబ్బంది అవసరం అవుతారు అంటూ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. అదే విధంగా టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై కూడా వారిద్దరూ ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. ఇదంతా మంత్రి నారాయణ పరోక్షంలో జరగడం విశేషం. పరి

2

ఉచిత విద్యుత్తును అందించేందుకే..

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం

విశాలాంధ్ర -కావలి : పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చెప్పారు.కావలి పట్టణంలోని తుమ్మలపెంట రోడ్ లోని స్పందన ఫంక్షన్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "పి.ఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన "అనే పథకం ద్వారా విద్యుత్ వినియోగదారులు పొందే ప్రయోజ నాల పరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్కడ పలు సోలార్ ఏజెన్సీ వారు ఏర్పాటు చేసిన పరికరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజలను విద్యుత్తు బిల్లుల భారీ నుండి విముక్తి కలిగించేందుకే ఈ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. మనకి అందుబాటులో ఉన్న రామయ్య పట్నంలో 24 కోట్ల రూపాయలతోటి సోలార్ ప్లాంట్ నిర్మిస్తున్నామని తెలిపారు. సోలార్ వినియోగించడం వల్ల ప్రమాదాలతో పాటు,కాలుష్యాన్ని నివారించవచ్చునన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఈ సోలార్ బిగించుకొని ఉచిత కరెంటును పొందడంతో

2

తొలి సోమవారం కార్తీక శోభ

విశాలాంధ్ర -కావలి : కార్తీక మాసోత్సవాలలో భాగంగా తొలి సోమవారం భక్తులతో కావలి పట్టణంలోని పాతూరు శివాలయం కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి మహిళా భక్తులు కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచి స్వామిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. మాఢవీధులు, ఉసిరి చెట్టు వద్ద మహిళలు పెద్ద ఎత్తున కార్తిక దీపారాధనలు చేశారు. భక్తుల రద్దీతో సందడిగా మారింది. తెల్లవారుజామున నుంచే ఆలయంలో దీపాలను వెలిగించిన తర్వాత భక్తులు మల్లికార్జున స్వామి, శివాలింగాలను దర్శించుకున్నారు. ఆలయం ముందు మహిళలు దీపాలు వెలిగించి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో పంచామృత అభిషేకాలు, అర్చనలు మహాదేవునికి నిర్వహించారు.ఆలయంలో మహిళలు గోధుమ పిండితో చేసిన ప్రమిదల్లో దీపాలు వెలిగించి భక్తిభావాన్ని చాటారు. గర్భాలయంలో గల శివునికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించి దీపారాధన చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శివునికి క్షీరాభిషేకం చేసి ఏకబిల్వాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామంలోని సముద్రం ఒడ్డున తెల్లవారుజాము నుంచే మహిళా భక్తులు పూజలు చేశారు.

పోరాడి సాధించాడు.. అన్యాక్రాంతమైన దొరువు భూమి

ఆ భూమిని ప్రభుత్వ స్వాధీనం చేసేందుకు ఓ న్యాయవాది అవిశ్రాంత పోరాటం

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్ : ఆయన పేరు పాముల హరిప్రసాద్. న్యాయవాద వృత్తి.. ప్రవృత్తి ప్రజా సమస్యలపై పోరాటం... అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పగించేందుకు అవిశ్వాంత పోరాటం చేయడం.. ఆయన పోరాటానికి అధికారులు తలవంచాల్సిందే.. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించేందుకు ఇటీవల ఆయన చేసిన పోరాటం సంచలనంగా మారింది. సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలం కోడూరు బిట్ వన్ పరిధిలో సర్వేనెంబర్ 1105లో 2.20 ఎకరాల దొరువు భూమి ఉంది. ఆ భూమి దొరువు భూమి అని 1974 వ సంవత్సరంలోనే ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఆ భూమిని గ్రామానికి చెందిన రాఘవరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడు. ఆ భూమిని గ్రామస్తులు కర్మ క్రతువులు , దోబీ ఘాట్ కింద వినియోగించుకుంటూ ఉండేవారు. అయితే భూమి ఆక్రమణకు గురి కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరుకు చెందిన న్యాయవాది పాముల హరిప్రసాద్ దృష్టికి భూ ఆక్రమణ విషయం వెళ్ళింది. దీంతో ఆయన ఈ విషయమై జిల్లా రాష్ట్రస్థాయిలో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు ఎవరూ స్పందించలేదు. దీంతో ఆయన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఇతర వివరాలను డిప్యూటీ సీఎం కార్యాలయానికి పంపారు. డిప్యూటీ సీఎం కార్యాలయం రంగంలోకి దిగడంతో నెల్లూరు జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. ఆ భూమి దొరువు పోరంబోకు అని తోటపల్లి గూడూరు మండల రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని తోటపల్లి గూడూరు తహసీల్దార్ రాతపూర్వకంగా న్యాయవాది పాముల హరిప్రసాద్ కు అందజేశారు. అంతేగాక ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయించడం విశేషం. పాముల హరిప్రసాద్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పరిపాలనలో అధికార పార్టీ నాయకుల పెత్తనం..?

మొదటి పేజీ తరువాయి

పాలనలో రాజ్యాంగేతర శక్తుల జోక్యంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. అధికారులను మంత్రి క్యాంపు కార్యాలయానికి పిలిపించి వారితో సమావేశం కావడానికి వీళ్ళిద్దరూ కనీసం ప్రజాప్రతినిధులు కూడా కాదు.. కార్పొరేటర్లు కూడా కాదు... కేవలం అధికార పార్టీలో నాయకులు మాత్రమే. పరిపాలనలో నాయకుల జోక్యం పై ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతుంది. మంత్రి నారాయణ ఇలాంటి పోకడలను కట్టడి చేయకుంటే భవిష్యత్తులో ఆయనకు పూర్తిస్థాయిలో అప్రతిష్ట వచ్చే ప్రమాదం ఉంది.

ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం

మొదటి పేజీ తరువాయి

పాటు మీరు నిలువ చేసుకున్న కరెంటును ప్రభుత్వానికి అమ్ముకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ సోలార్ సిస్టం బిగించుకునేందుకు ప్రభుత్వం నుంచి 20 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. అంతేకాకుండా సోలార్ కొనుగోలుదారులకు బ్యాంకులు 80 శాతం రుణాలను మంజూరు చేస్తుందన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలందరూ కూడా ఉచితంగా విద్యుత్తును పొందాలనుకుంటే ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజలి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రీవెన్స్‌కు పోటెత్తిన ప్రజానీకం :ఎమ్మెల్యే సోమిరెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఊరిలో సచివాలయాలు పెట్టి, ఉద్యోగులను నియమించినా ఇన్ని సమస్యలు పేరుకుపోవడం ఆశ్చర్యంగా ఉంది. రైతులు అవసరమైతే సర్వే చేయమని దరఖాస్తు చేస్తారు. కానీ ఎవరూ కోరని రీసర్వేను చేపట్టి రైతులను సమస్యల్లో ముంచడమెందుకో పక్కా ఇళ్ల అసంపూర్ణ నిర్మాణాలపైనా పలువురు అర్జీలు ఇచ్చారు. వైసీపీ పాలనలో హౌసింగ్ శాఖను భ్రష్టు పట్టించారు 2019కి ముందు కట్టిన ఇళ్లకు సంబంధించిన బిల్లులను కక్షపూరితంగా ఆపేశారు. దళితులు, గిరిజనులు అనే తేడా లేకుండా అందరినీ ఇబ్బంది పెట్టారు వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క కాలనీ నిర్మాణం పూర్తిగా జరగలేదు ఇప్పుడున్నది ప్రజల కోసం పనిచేస్తున్న మంచి ప్రభుత్వం.ప్రతి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత మాతో పాటు అధికారులపై ఉంది. నెల రోజుల్లో సాధ్యమైన సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం : ఎమ్మార్వో శ్రవణ్ కుమార్

విశాలాంధ్ర- కావలి రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతే కాకుండా మనము పనిచేసే ఏ కార్యాలయం అయినా పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా జీవించగలమని కావలి మండల రెవెన్యూ అధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రజలు అనేక సమస్యలపై కార్యాలయానికి వస్తూ ఉంటారు. అలాంటప్పుడు కొంతసేపు కార్యాలయ ఆవరణలో సేద తీరాలంటే కార్యాలయము పరిశుభ్రంగా ఉన్నప్పుడే సమస్యల్లో వచ్చిన ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతుందని తెలిపారు. సోమవారం ఎమ్మార్వో కార్యాలయంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. బయట ఆవరణలో చెత్తాచెదారాలను శుభ్రం చేయించారు. ఆవరణ ముందు మొక్కలు నాటేరు. కొన్ని దశాబ్దాల నుంచి ఎమ్మార్వో కార్యాలయంలో బావి నీళ్లు దుర్గంధ భరితంగా తయారైంది. బావిలో చెత్త చెదరాలతో నిండిపోయింది. ఎంతోమంది రెవెన్యూ అధికారులు ఈ కార్యాలయంలో పనిచేసిన ఈ బావి దుస్థితిపై చర్యలు తీసుకోలేదు. ప్రజలు సమస్యలపై వచ్చినప్పుడు కనీసం నీరు త్రాగడానికి ఇబ్బంది లేకుండా తన సొంత డబ్బులతో ఆ బావిలో ఉన్న చెత్తాచెదారాలను శుభ్రం చేయించి, బావిలో ఉన్న నీటిని ఇంజన్ల ద్వారా బయటకు తోడించారు. అంతేకాకుండా బావి చుట్టూ పేరుకుపోయిన అప్రశుభ్రతను క్లీన్ చేపించి బావిపై కంచ ఏపించారు. కొన్ని దశాబ్దాల నుంచి మరమ్మత్తులకు గురైన బావిని తన సొంత నిధులతో బాగు చేయించి ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎమ్మార్వో పారిశుద్ధ్య చర్యలు చేపట్టంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వర్షాకాలంలో రెవెన్యూ కార్యాలయం పూర్తిగా నీటితో నిండిపోతుంది. దాని దృష్టిలో పెట్టుకొని తన స్వీయ నిధులతో కార్యాలయం పైన పట్టను వేపించారు. కార్యాలయానికి వచ్చిన వాహనాలను క్రమ పద్ధతిలో పెట్టించాలని సిబ్బందికి సూచించారు. ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో ఎమ్మార్వో కార్యాలయం సుందరంగా తయారైంది. ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ ను చేస్తున్న కృషికి కావలి ప్రాంత ప్రజల్లో మంచి స్పందన వస్తుంది. ఎమ్మార్వో కార్యాలయాన్ని సుందరంగా చేపించిన ఎమ్మార్వో కు ప్రజలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఆశాజనకంగా నాటు గులాబీ సాగు

గులాబి రైతుల కష్టాల్ని దోపిడీ చేస్తున్న దళారులు

దిగుబడి ఉన్నా.. గిట్టుబాటు ధర అంతంతమాత్రమే

విశాలాంధ్ర- కావలి రూరల్: అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లు నాటు గులాబీ సాగు చేస్తున్న రైతాంగంలో అలుముకుంది. గులాబి సాగు చేస్తున్న రైతుల కష్టం దళారుల ఫాలవుతుంది. కావలి మండలంలోని తీర ప్రాంతంలో గులాబీ సాగు వైపు రైతులు ముగ్గు చూపుతున్నారు. ఆశాజనకంగా లాభాలు లేకపోయినా, నష్టాలు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల తీర ప్రాంత%శీ%లో రైతంగం ఈ సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. అంతేకాకుండా ఈ తీర ప్రాంతంలో ఇసుక నేలలు పూల పంటలకు అనువుగా ఉంటుంది. ఆరుతడి నెలల్లో ఈ పూల పంటలు బాగా వస్తాయి. తుమ్మలపెంట పంచాయతీలోని కొత్త సత్రం, పూల దరువు, మామిడిదోరువు, అన్నగారి పాలెం పంచాయితీలో అన్న గారి పాలెం నడింపల్లి, ఓట్టూరు గ్రామాల్లో రైతులు నాటు గులాబీ పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలు వేసుకున్న రైతులు పెద్దగా నష్టాల బారిన పడకుండా జీవించడానికి కొంతవరకు ఉప శమనంగా ఉంటుంది. ముఖ్యంగా 80 మంది రైతాంగం నాటు గులాబీ పంటల సాగు చేస్తున్నారు. ఒక ఎకరా గులాబీ సాగు చేయాలంటే రైతుకు 50 వేల పైనే ఖర్చవుతుంది. ఈ నాటు గులాబీ మొక్కలను రాజమండ్రి, వింజమూరు ప్రాంతాల్లో అమ్ముతారు. ఒక మొక్క 15 రూపాయలు పడుతుంది. ఒక ఎకరానికి 2000 మొక్కలు నాటాలి. ఒక మొక్కకి మరో మొక్కకి రెండున్నర అంగుళం స్థలం గ్యాపు ఇచ్చి మొక్కలు నాటాలి. ఈ నాటు గులాబీ పంట సాగుకు వచ్చేసరికి 90 రోజులు పడుతుంది. ఆ తరువాత ప్రతిరోజు పంట కోతకు వస్తుంది. ఒక ఎకరా సాగులో 60 నుంచి 70 కేజీలు పూల దిగుబడి వస్తుందని రైతులు చెప్తున్నారు. మార్కెట్లో అమ్మేసరికి రైతు దగ్గర నుంచి ఒక కిలో 30 రూపాయలు మాత్రమే వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి బాగానే ఉన్నా అమ్మేసరికి దళారులు మా కష్టాన్ని దోచుకుంటున్నారని సాగు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవంబరు, డిసెంబరు, జనవరి, మాసాలలో ఈ పూల సాగు చాలా బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మంచు కాలంలో ఈ నాటు గులాబీ సాగు ఆశాజనకంగా ఉంటుందని రైతంగం తెలుపుతున్నారు. అంతేకాకుండా ఈ సాగు చేసేటప్పుడు వారానికి వారానికి మందులు పిచికారి చేయాలని తెలిపారు. సస్యరక్షణ చర్యలు చేసి పంట దిగుబడికి వచ్చేసరికి రైతులకు పెద్దగా లాభాలు ఉండకపోయినా దళారులకు మాత్రం వరంగా మారుతుందని రైతంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగ సీజన్లో, శ్రావణ మాసంలో రైతుకు ఒకే ధర ఉంటుందని, కానీ దళారులు మాత్రం అధిక ధరలకు ఈ పూలను అమ్ముకుంటూ బాగా సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మేము పండించే ఈ పూల పంటలను డైరెక్ట్ గా కొనుగోలు చేస్తే మంచి లాభాల బాటలో ఉంటామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దళారులు మధ్యలో మా కష్టాన్ని దోచుకుని సొమ్ము చేసుకుంటున్నారని నాటు గులాబీ సాగు చేస్తున్న రైతన్నలు వాపోతున్నారు.

నాగుల చవితికి సిద్ధమైన కొత్తపల్లి శివ నాగ దేవతల పుట్ట మందిరం

విశాలాంధ్ర- కావలి రూరల్ : కావలి మండలం కొత్తపల్లి గ్రామంలో వెలసిన శ్రీ శివ నాగ దేవతల పుట్ట మందిరంలో మంగళవారం నాగుల చవితి పండగకు ఆలయం సిద్ధం చేశారు. వందల మంది మహిళలు తమ ఇష్ట దేవత నాగరపమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకొని పుట్టలో పాలు పోసి ఆ తల్లి కృపకు పాత్రులవుతారు. మండలంలోని %ఎ% మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించి నాగర్పమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో కొత్తపల్లిలో కొలువుతీరిన శ్రీ శ్రీ శ్రీ శివ నాగ దేవతల పుట్ట మందిరంలో వేలదిమంది మహిళ భక్తులు తరలివచ్చి అమ్మవారికి పాలు పుట్టలో పోసి మొక్కులు చెల్లించుకోని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు తెలిపారు.

ఐఏబీ సమావేశం వెంటనే నిర్వహించాలి-తెలుగురైతు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు:ఐఏబీ సమావేశం వెంటనే నిర్వహించాలి అనిజాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను కోరిన తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిరావూరు రాధాకృష్ణమనాయుడుశ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్రధాన జలాశయాలైన సోమశిల, కండలేరుల్లో నీటి మట్టం120 టీఎంసీలకు చేరుకుంది. ప్రతి ఎకరాలో మొదటి పంట పండించుకునేందుకు అవకాశం ఏర్పడింది.జీఓ 99 ప్రకారం ఏటా క్రమం తప్పకుండా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహిస్తారు. ఇదే క్రమంలో వెంటనే ఐఏబీ సమావేశం నిర్వహించి ప్రజాప్రతినిధులతో పాటు రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలు, ఇరిగేషన్ అధికారుల సమస్యలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. నవంబర్ 11 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైతే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావల్సివుంది.కావున ఈ లోపే జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆయన జాయింట్ కలెక్టర్ ని కోరారు.

యాదవపాలెంలో రోడ్డును నిర్మించండి ప్రజారోగ్యాన్ని కాపాడండి

విశాలాంధ్ర-జలదంకి : మండల కేంద్రమైన జలదంకి లోని యాదవ్ పాలెం రోడ్డు పైన మురికి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతూ పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యం హరించుకుపోతుందని సిపిఎం నాయకులు రావి మాల్యాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. యాదవ పాలెంలో రోడ్డు పల్లమై రోడ్డుపైన నీళ్ల నిలుస్తున్నాయన్నారు. అలాగే హాస్టల్ బజారులో ఇదే పరిస్థితి ఉందని 100 అడుగులు రోడ్డు నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. యాదవపాలెంలో, హాస్టల్ బజార్లో ఒకటిన్నర అడుగుల ఎత్తు రోడ్డు నిర్మాణం చేయాలన్నారు.

రైతుల సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-మనుబోలు:మనుబోలు చెరువుకు సంబంధించి రైతులు టిడిపి యువ నేత పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సోమిరెడ్డికి విన్నవించు కోవడంతో వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చేశారని పచ్చిపాల రామిరెడ్డి మీడియాకు తెలిపారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని తెలిపారు. ప్రస్తుతం తూములకు సంబంధించిన చెక్కలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతు సమస్య పరిష్కారం అయిందని సాగునీరుకి ఎలాంటి లోటు భవిష్యత్తులో ఉండదని తెలిపారు. రాష్ట్ర రైతు కార్యదర్శి రాయపాటి కిరణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైసిపి నాయకులు దోచుకోవడం దాచుకోవడం తప్ప ఏమి చేయలేదని అన్నారు. మా ఎమ్మెల్యే సోమిరెడ్డి రైతు సమస్యకు వెంటనే పరిష్కారం చూశారని ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలికి రమేష్ రెడ్డి, సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

సుందరయ్య నగర్ సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది కందుకూరు పట్టణం ఆరో వార్డు సుందరయ్య నగర్ నందు ఉన్న సమస్యలు పరిష్కరించాలని కందుకూరు మున్సిపల్ కమిషనర్ తో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్ మాట్లాడుతూ కందుకూరు పట్టణానికి సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం కోసం ఆరోజు అక్కడ నివాసం ఉంటున్న పేదల ఇల్లు తొలగించి పక్కనే ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరిగింది రామతీర్థం నుండి కందుకూరు పట్టణానికి పరిసర ప్రాంతాలకు పైప్లైన్ ద్వారా మంచినీటి వసతి కల్పించారు సమ్మర్ స్టోరేజీ అనుకొని పక్కనే ఉన్న సుందరయ్య నగర్ లింబిని వనానికి మంచినీళ్ల పైప్ లైన్ గాని కొళాయి కనెక్షన్ గాని కల్పించలేదు సమ్మర్ స్టోరేజీ నిర్మాణం కోసం నివాసం ఉంటున్న ఇళ్లను తొలగించి పక్కనే ఇల్లు నిర్మించుకోమని స్థలం చూపించారు ఆ సందర్భంలో ప్రజా ప్రతినిధులు అధికారులు మాట్లాడుతూ సుందరయ్య నగర్ కాలనీ మోడరన్ కాలనీ చేస్తాము అని అన్నారుఆచరణలో ఇప్పటివరకు మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా చాలీచాలని నీళ్లు పంపిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చేయటం లేదని అన్నారు. కమిషనర్ మాట్లాడుతూ తక్షణమే మంచినీటి పైప్ లైన్ నిర్మాణం చేపడతామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి వెంకట్రావు ఎస్.కె మల్లిక ఎం పద్మ ఏం రాయుడు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు 20న నోటిఫికేషన్

విశాలాంధ్ర-ముత్తుకూరు :మండలంలోని ఆరు సాగునీటి సంఘాల ఎన్నికలకు ఈనెల 20వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు జరపనుందని అందులో భాగంగా ఇప్పటికే ఓటర్ల జాబితాను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ నుండి ఆదేశాలు రావడంతో తాము మండలంలోని ఆరు సాగునీటి సంఘాల పరిధిలోని ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.. ఈనెల 6 నుండి 10 వరకు ఓటర్లు జాబితా పూర్తి చేస్తామన్నారు. 11 నుండి 12 వరకు ఓటర్లు నమోదుపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయవచ్చున్నారు. 13వ తేదీన ఫైనల్ జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే 14న ఆర్డీవోకు అఫీలు చేసుకోవచ్చున్నారు. 16, 17 తేదీలలో ఆర్డీవో పరిశీలించి అభ్యంతరాలను ఫైనల్ చేయడం జరుగుతుందన్నారు. దానిపై కూడా అభ్యంతరాలు వస్తే 18 నుండి 20వ తేదీ లోపల రాష్ట్ర ఇరిగేషన్ కమిషనర్ కు అఫీలు చేసుకోవచ్చున్నారు. 20వ తేదీ న మండలంలోని ముత్తుకూరు, పంటపాలెం, పొట్టింపాడు, బ్రహ్మదే వం, పి డతా పోలూరు, పైనాపురం సాగినీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందన్నారు. 23న ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలిపారు.

నూరుబాషాలకు ఇండియన్ ముస్లిం దూదేకులని జిఓ జారీ చేయాలి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: నూరుబాషలకు ఇండియన్ ముస్లిం దూదేకులని జిఓ జారీ చేయాలని నూరుబాషాసంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. నూరుబాషా (దూదేకుల) కులస్తులు రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది ఉన్నారు. ప్రభుత్వం నుండి కోరేది మాకు ఇండియన్ - ముస్లిం - దూదేకుల / నూరుబాషాలు అని ఒక గవర్నమెంట్ జిఓను జారీ చేయాలని కోరారు. నూరుబాషా కార్పొరేషన్ ఏర్పాటుచేసి 200 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలి. నామినేటెడ్ పదవులలో నూరుబాషలకు దామాషా ప్రకారం పదవులు కేటాయిచాలి.బద్వేల్‌లో జరిగిన దస్తగిరమ్మ హత్యకు కారకులైన విఘ్నేష్‌ని ఫాస్ట్ ట్రాక్ ద్వారా తగిన శిక్ష వెయాలి. గత ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు నూరుబాషా కార్పొరేషన్ నుండి డైరెక్టర్‌ను నియమించలేదు. జిల్లాలో లక్ష మంది నూరుబాషాలు ఉన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండి ఫరూక్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షులుషేక్ సలీమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేను నీలాంటి అక్రమార్కుడిని కాదు.. తులసికి వెందోటి కౌంటర్

విశాలాంధ్ర -మనుబోలు: నేను నీలాంటి అక్రమార్కుని కాదని జట్ల కొండూరు ఉపసర్పంచ్ ఆవల తులసీను ఉద్దేశించి మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.సోమవారం తాహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాపై కావాలని సామాజిక మధ్యమాలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. తాను ఏనాడు కూడా తప్పు చేయలేదని ఇక పైన కూడా చేసేది ఉండదని సూచించారు. అన్ని అక్రమాలకు పాల్పడింది తులసి రామ్ కుటుంబమేనని ఆరోపించారు. చెరువును 30 అడుగుల లోతు లోడి తాను ఆయన లాగా మట్టి అమ్ముకోలేదని ఎద్దేవా చేశారు. ఆయన లాగా రాత్రికి రాత్రే 13 ఎకరాలు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తన పై వచ్చిన ఆరోపణలకు తాను అన్ని పార్టీలను సమక్షంలో పిలుస్తానని బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. తాను ఎలాంటి స్మశానంగానీ, రోడ్డు కానీ ,చెరువు కానీ, ఆక్రమించలేదని తేల్చి చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విచారణ జరిపించి ఎవరు తప్పు చేశారు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు, పట్టింపాడులో స్మగ్లింగ్ చేసి దొరికిపోయిన రామచంద్రారెడ్డి కుటుంబం తనను విమర్శించే స్థాయి లేదని హెచ్చరించారు. సంవత్సరాల తరబడి తనపై చేస్తున్న ఆరోపణలను ఒకటైన రుజువు చేయగలిగారా అంటూ సూటిగా ప్రశ్నించారు. అనంతరం తాహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, భారీగా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై కళా ప్రదర్శన

విశాలాంధ్ర -ముత్తుకూరు : సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని బ్రహ్మదేవం, పొట్టింపాడు, పోలం రాజు గుంట పంచాయతీలలో సోమవారం కళాజాత ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించింది. డయేరియా, మలేరియా వంటి వ్యాధులతోపాటు వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులను కళాకారులు కళ ప్రదర్శనల ద్వారా స్థానిక ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్రహ్మదేవంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి తిరుపతి పార్లమెంట్ గౌరవాధ్యక్షులు, జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు కొత్తపల్లి రమేష్ కుమార్, స్థానిక నాయకులు ఆలూరు విష్ణువర్ధన్ రావు, దాసరి శ్రీనివాసులు, బొబ్బేపల్లి అంకయ్య, అలి ముత్తు, సచివాలయ కార్యదర్శి లెనిన్, సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు. అలాగే పొట్టిపాడు లో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక నాయకులు పార్లపల్లి శ్రీనివాసుల రెడ్డి, విజయ్ రెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు. పోలం రాజు గుంటలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు

విశాలాంధ్ర -కావలి : ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేసి వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నెల్లూరు జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి అధ్వర్యంలో సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో కావలి ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేయకపోవడం వల్ల వ్యవసాయ కార్మికుల పిల్లల ఫీజులు పెనుభారంగా మారి చదువులు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలతో గ్రామాల్లో, పట్టణాల్లో నివసిస్తున్న పేద ప్రజానికానికి ఎంతో కొంత కుటుంబాలకు ఆర్థిక సహాయం తోడువుతుందని, సూపర్ సిక్స్ హామీలు అమలు కాకపోవడంతో పేదలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని స్కూల్ కి వెళ్లే ప్రతి విద్యార్థికి 15000 రూపాయలు అందించాలని, సాంకేతిక కారణాలను పక్కన పెట్టి అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ల ఇవ్వాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు మూడు వేల రూపాయలు నిరుద్యోగ భృతి తక్షణమే చెల్లించాలని, ప్రతి రైతుకి ఏటా 20, 000 రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని, మహిళలకు చేయూత పథకం తక్షణమే అమలు చేయాలని, ఇంటింటికి రక్షిత త్రాగు నీరు అందించాలని, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను 3 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచాలని, పేదలకు పశువులు కొనుగోళ్లు, దాణా, మందులు కొనుగోళ్లపై సబ్సిడీలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, గోకులాలు ఏర్పాటు చేసి పశువులు మేత కోసం బంజరు భూములు కేటాయించాలని, వ్యవసాయ కూలీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాయితీలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహారావు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల ఏర్పాటు

విశాలాంధ్ర-మనుబోలు: మడమనూరుసచివాలయంలో ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను బిజెపి జనసేన నాయకులు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేశం గర్వించ తగ్గ విధంగా అభివృద్ధి సంక్షేమం గురించి ప్రధాని అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమం నిత్యం ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారని తెలిపారు. బిజెపి నాయకులు వెంకయ్య, జనసేన యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం టీట్కో ఇళ్ల నివాసస్థుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అల్లిపురం టెట్కో ఇళ్లలో నివాసముంటున్న వారం దరికిని వీధిలైట్లు లేక పారిశుద్ధ్యంలేకుండా వుంది. దీనిపై చర్యలు తుసుకో వాలనిఅలాగే పగలు రాత్రి తేడా లేకుండా మద్యం బాబులు హల్చల్ చేస్తున్నారు. సముదాయానికి వెనుక వైపు అంటే అల్లిపురం మేకల వారి తోట లాకుల వద్ద నుంచి సముదాయంలోకి వెళ్లే రహదారి మూసి వేయటంతో ఇళ్లలో నివాసం ఉంటున్న వారందరును చాలా ఇబ్బందులు పడుతూ మున్సిపల్ అధికారులకి స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలిపిన సరైన స్పందన రానందున నెల్లూరు నగర్ మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్ధన్‌కి సమస్యలపై వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ బి ఎల్ శేఖర్ ఎక్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చౌటురు శ్రీనివాసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు గంధర్ల శ్రీరాములు పాల్గొన్నారు .

ప్రధానమంత్రి సూర్యఘర్‌పై అవగాహన : ఎంపిడిఓ శ్రీహరి

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డి పాలెం: బుచ్చిరెడ్డిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్యఘర్ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరి ప్రధానమంత్రి సూర్య ఘర్ యొక్క ప్రాధాన్యత పై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేలో ఎమ్మార్వోకు 7 అర్జీలు

విశాలాంధ్ర-కావలి రూరల్: కావలి మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కావలి ఎమ్మార్వో శ్రావణ్ కుమార్‌కు ప్రజలు పలు సమస్యలపై ఏడు అర్జీలు అందజేశారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తానని తెలిపారు.

పెళ్లిరోజు పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ

విశాలాంధ్ర-కావలి : స్థానిక తుఫాన్ నగర్ నివాసులు పొదిల వాసుదేవరావు - వరలక్ష్మి దంపతులు వారి కుమారుడు కోడలు పొదిల. కిషోర్ కుమార్ - తేజస్వినిల పెళ్లిరోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ద్వారా బుడంగుంట గిరిజనులకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ పొదిల. వాసుదేవరావు - వరలక్ష్మి కుమారుడు కోడలు పెళ్లిరోజును ఆడంబరాలకు పోయి వృధా ఖర్చులు చేయకుండా పేదవారికి ఆకలి తీర్చటం సంతోషంగా ఉందని తెలిపారు.

అయ్యప్పస్వామి అన్న ప్రసాద భవనానికి రూ.10,1116లు విరాళం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు పట్టణంలో కనిగిరి రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణ వెనుక భాగంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి అన్న ప్రసాద భవనానికి నలదలపూరు గ్రామ మాజీ సర్పంచ్ ఉన్నం వెంకటేశ్వర్లు ధర్మపత్ని ఈశ్వరమ్మ వారి కుటుంబ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులకు రూ 10,1116 లు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్య గురు స్వామి కె ఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకట నరసింహ, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచు రామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి, మాదాల నర్సింగరావు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తులకు 12 అర్జీలు

విశాలాంధ్ర- కావలి: కావలి ఆర్డిఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో ఆర్డిఓ వంశీ కృష్ణకు 12 అర్జీలు ఇచ్చారు . డివిజన్ పరిధిలోని ప్రజలు పలు సమస్యలపై అర్జీలు ఇవ్వటం జరిగిందని ఆర్డీవో తెలిపారు. త్వరలో ప్రజా విజ్ఞప్తులను పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో కామాక్షి దేవి



విశాలాంధ్ర-మనుబోలు: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మనుబోలు సంగమేశ్వర దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు సాయి శర్మ వేకువజామున రుద్రాబిషేకం నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు కామాక్షి దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివ పార్వతులను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.తుమ్మూరు ముని మోహన్-వెంకట సులోచన దంపతులు అన్నదానం నిర్వహించారు.

గణేష్ ఘాట్ కాశీ ఘాట్‌ను తలపించే విధంగా ఏర్పాట్లు : రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని గణేష్ ఘాట్ ను కాశి ఘాట్ ను తలపించే విధంగా తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ నెల 15వ తేదీన సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమం జరుగుతుంది. సింహపురి కార్తీక దీపోత్సవ సమితి చేపట్టిన ఈ పవిత్ర కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యుడిగా అన్నిరకాలుగా అండగా ఉంటా. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు మహిళలతో శోభాయాత్ర, 6 గంటలకు 108 తెప్పలతో శివకృతి కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్తీక దీపోత్సవంలో నెల్లూరు జిల్లా ప్రజలందరూ పాల్గొనండి. హరహరమహాదేవ్ శంభో శంకర నినాదాలతో గణేష్ ఘాట్ మారుమోగుతుంది. నెల్లూరు రూరల్, నగర ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆ భగవంతుని కృప కటాక్షాలు పొద్దాలని శ్రీధర్ రెడ్డి కోరారు.

మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - బుచ్చిరెడ్డిపాలెం:భవన నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.నగర అభివృద్ధిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే పనులకు బిల్లులు చెల్లిస్తామని బుచ్చి కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పాత మున్సిపల్ భవన నిర్మాణ అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. బెస్మెంట్ నిర్మాణంలో వాడే మట్టి ఇతర పనులకు సంబంధించిన ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబందిత కాంట్రాక్టర్ మాట్లాడుతూ రామచంద్ర పురం మున్సిపల్ స్థలం నుంచి నాణ్యమైన మట్టిని బెస్మెంట్ నిర్మాణంలో వాడటం జరిగిందని తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిబంధనల మేరకు నిర్మాణ పనులుంటేనే కాంట్రాక్టర్లకు ఎలాంటి కోతలు లేకుండా బిల్లులు అందిస్తామని తెలిపారు.తనిఖీల్లో సచివాలయ సర్వేయర్ లు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..

జవహర్ భారతి కళాశాలలో నెమరువేసుకున్న కావ్య కృష్ణారెడ్డి

విశాలాంధ్ర- కావలి: జవహర్ భారతి కళాశాల పేరు వింటేనే నా చదువుకొన్న రోజులు గుర్తుకు వస్తాయి. మిత్రులతో గడిపిన ఆ మధుర క్షణాలు గుర్తు చేస్తాయి. విద్యార్థి దశ నుంచి ఉపాధ్యాయుడుగా ఈ కళాశాలలోనే నా జీవితం ప్రారంభమైంది. నా ఎదుగుదలకు ఈ జవహర్ భారతి కళాశాలే నంది పలికిందని, ఆ రోజులు మళ్లీ ఇక్కడికి వచ్చినప్పుడు గుర్తుకొస్తున్నాయని కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. సోమవారం కావలి జవహర్ భారతి కళాశాలల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ జవహర్ భారతి కళాశాలలో తను చదువుకునేటప్పుడు ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులు, కష్టాలను విద్యార్థులకు వివరించారు. అప్పుడు కష్టాలు ఎదుర్కొని కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి వచ్చాను కాబట్టి ఈరోజు ఈ సన్మానం నాకు దక్కిందన్నారు. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని తెలిపారు.

భూ రీ సర్వేలో లోపాలు సరిదిద్దండి

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్ : గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీ సర్వే లోపభూయిష్టంగా ఉందని, లోపాలను సరిదిద్దాలని బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్య జెసిని కోరారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని జాయింట్ కలెక్టర్ కార్తీక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ల్యాండ్ రీ సర్వే లో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. లోపాలను గుర్తించి అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. జెసి కార్తీక్ సానుకూలంగా స్పందించారు.

సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ - కమిషనర్ సూర్యతేజ

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్ : నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు.

విభాగాల వారీగా రెవెన్యూ-1, ఇంజనీరింగ్- 13, అకౌంట్స్ - 6, అప్కాస్ - 1, టౌన్ ప్లానింగ్ - 9, పబ్లిక్ హెల్త్ - 6, హౌసింగ్ - 6, మొత్తం 42 ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. అనంతరం విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులు తమ సమస్యలను 94940 18118 నెంబరుకు వాట్సప్ ద్వారా లేదా 0861-2356777, 0861-2316777 హెల్ప్ లైన్ నెంబర్లకు ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల లోపు తెలియజేయాలని కోరారు. అందుకున్న ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియచేసి తక్షణమే సదరు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్క రిం చేందుకు చర్యలు చేపడ తామని కమిషనర్ తెలిపారు.వివిధ మధ్యమాల ద్వారా కం ట్రోల్ సెంటర్‌కు ఇప్పటి వరకు 909 ఫిర్యాదులను అందుకున్నామని, వాటిలో 718 సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించామన్నారు.స్థానికంగా పార్కుల నిర్వహణలో ప్రజలు స్వచ్ఛంధంగా భాగస్వామ్యులు కావడానికి ఆసక్తి చూపు తున్నారని తెలిపారు. సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ద్వారా తప్పనిసరిగా ప్రజల తోడ్పాటు తీసుకుంటామన్నారు.ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ నందన్, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్.ఈ రామ్‌మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధి కారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణ కిషోర్, మేనేజర్ ఇనాయ తుల్లా అధికారులు, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పనబాక లక్ష్మి దంపతులు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యురాలిగా నియమితులైన మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య దంపతులు సోమవారం అమరావతి నందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కలిసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధికి పాటు పడతానని ఆమె ముఖ్యమంత్రికి తెలియజేశారు.

టిసిజిఎస్ -1694 రకం పంపిణి

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ :కృషి విజ్ఞాన కేంద్రం, కందుకూరు సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా. జి. ప్రసాద్ బాబు వేరుశనగ పంటలో సామూహిక ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రాలను అమలు పరచడంలో బాగంగా ఉలవపాడు మండలంలోని టెంకాయచెట్లపాలెం, బట్టి సోమయ్య పాలెం గ్రామాల రైతులకు కేవీకే కందుకూరులో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. టీసీజీఎస్-1694 వేరుశనగ నూతన రకాన్ని రైతులకు అందజేశారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ లో భాగంగా వేరుశనగలో ఖర్చు తగ్గించి అధిక దిగుబడి సాధించడానికి సమగ్ర పోషకాల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ ద్వారా చీడపీడల యాజమాన్యం, నేలద్వారా సంక్రమించే మొదలుకుళ్ళు, వేరుకుళ్ళు, ఎండుతెగులు, నులిపురుగులయాజమాన్యం, సహజ నూనెల తయారీ వంటి అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వేరుశనగ విత్తేముందు ఎకరాకు 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 20 కిలోల యూరియా వేసుకోవాలని తెలిపారు. 3 పంటలకు ఒకసారి 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని సూచించారు. కిలో విత్తనానికి 2 మీ.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్‌మందును 4 మీ.లీ. నీటిలో కలిపి విత్తనశుద్ధి చేసుకొని 10 నిమిషాలు ఆరబెట్టి తర్వాత టేబుకొనజోల్ 2డిఎస్ మందును కిలోకి 1 గ్రాము కలుపుకోవాలని తెలిపారు. విత్తిన 48 గంటల లోపల వేలార్ 32 అనే కలుపు మందును ఎకరాకు 1.0 లీ. పిచికారి చేసుకోవాలని తెలిపారు. నేలద్వారా సంక్రమించే తెగుళ్ళ నివారణకు ట్రైకోడెర్మ విరిడే, సూడోమోనాస్ 2 కిలోల చొప్పున 10 కిలోల పేడ ఎరువు మరియు 200 కిలోల వేపచక్క తో కలిపి ఆఖరు దుక్కిలో నేలలో వేసుకోవాలని తెలిపారు. రైతు శాస్త్రవేత్తల ముఖాముఖీ ద్వారా వారి సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. వెంకటేష్, డా. జ్యోతి, వివేక్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారి

నకిలీ విత్తనాలని నిరూపణ అయితే చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర కథనానికి స్పందించిన అధికారులు

విశాలాంధ్ర- కావలి రూరల్ : ప్రైవేట్ సీడ్ కంపెనీ అయిన ఇందిరా సీడ్స్ కంపెనీలో కావలి మండలం కొత్తపల్లికి చెందిన రైతులు వరి విత్తనాలను కొనుగోలు చేసి నష్టపోవడంతో ఆదివారం విశాలాంధ్ర దినపత్రికలో "కమిషన్ల మోజులో కావలి వ్యవసాయ శాఖ అధికారులు" అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి కావలి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం వ్యవసాయ శాఖ అధికారి ఏ లలిత ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామానికి వెళ్లి బాధిత రైతులను కలిసి వివరాలు సేకరించారు. అనంతరం బాధిత రైతులు మన్నేపల్లి రవీంద్ర, ఎర్ర మాల్యాద్రి కి చెందిన పొలాల్లో విత్తనాలు పోసిన పంటల దగ్గరికి వెళ్లి పరిశీలించారు. ఆ నారుమడిలో ఉన్న మొలక శాతాన్ని పరిశీలించారు. మొలకశాతం తగ్గిందని దానికి కారణమైన ఆ ప్రైవేట్ సీడ్ కంపెనీలో ఉన్న యాక్టివ్ సీడ్‌ని శాంపిల్స్ తీసుకుని నాణ్యత పరీక్షలకు పంపిస్తామని రైతులకు తెలిపారు. ఆ నాణ్యత పరీక్షలో పంపించిన శాంపిల్స్ నకిలీవని రుజువైతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. భూమిలో నాటిన విత్తనాలకు నష్ట పరిహారం ఇప్పించలేమని బాధిత రైతులకు తెలిపారు. ఆ సీడ్ కంపెనీలో విత్తనాలు కొని భూమిలో నాటి నష్టపోయిన రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇప్పించలేనని, నేరం రుజువైతే ఆ సీడ్ కంపెనీ నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి ఏ లలిత తెలిపారు. పంట పరిశీలన కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు ఆ గ్రామ బాధిత రైతులు పాల్గొన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి హామీ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: నవంబర్ 8న గిరిజనుల కోసం మరో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గస్థాయిలో వెంకటాచలం మండలం చెముడుగుంటలోని శ్రిడ్స్‌కళ్యాణ మండపంలోనిర్వహించనున్నాం. అత్యంత పేదరికంలో మగ్గిపోతున్న గిరిజన బిడ్డల జీవితాల్లో మార్పులు తేవడాన్ని ఒక సవాల్‌గా తీసుకున్నాం. మరీ దుర్భర స్థితిలోని కాలనీలను కొన్ని కంపెనీలు దత్తత తీసుకునేలా ప్రయత్నం చేసున్నాం. గిరిజనుల జీవితాల్లో మార్పులు తేవడంలో సర్వేపల్లిని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. గిరిజనుల కోసం అమలు చేస్తున్న అన్ని పథకాల ద్వారా వారికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామన్నారు.